19న విద్యుత్తు వినియోగదారుల సదస్సు

మంగపేట, ఏటూరునాగారం, న్యూస్‌టుడే: మంగపేట విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ఈనెల 19న విద్యుత్తు వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు ఎన్పీడీసీఎల్ వినియోగదారుల ఫోరం ఛైర్మన్ వేణుగోపాలచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకల్ కోర్టులో విద్యుత్తు పునరుద్ధరణ, కాలిపోయిన నియంత్రికలు మార్చడం, కరెంటు హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలున్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, ఎక్కువ బిల్లు రావడం, తదితర వాటికి సంబంధించిన ఫిర్యాదులు రాతపూర్వకంగా అందించాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలోని కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట మండలాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుణ్యస్నానం.. జర జాగ్రత్త



వనదేవతల దర్శనానికొచ్చిన భక్తులు పుణ్య స్నానాలాచరించడం సంప్రదాయం. జంపన్నవాగులో స్నానం చేస్తే పుణ్యం వస్తుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. మేడారం వచ్చిన వారంతా పుణ్య స్నానమాచరించిన తర్వాతనే వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకొంటారు. పుణ్యస్నానాల సమయంతో కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. వాగు ప్రవాహం, లోతు అంచనా వేయకుండా ప్రవాహంలోకి వెళ్లి గల్లంతవుతున్నారు. గత ఐదేళ్లలో పదుల సంఖ్యలో గల్లంతై, పలువురు ప్రాణాలు పోగొట్టుకొంటున్నా.. పట్టించుకోవడం లేదు. ప్రమాదాల నివారణకు గతంలో ప్రభుత్వం గజ ఈతగాళ్లను నియమించింది. వీరికి వేతనాలు చెల్లించకపోవడంతో ప్రస్తుతం విధులకు రావడం లేదు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని ఈ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, తాడ్వాయి(ములుగు జిల్లా)

యోగాసనాలు.. పేరిణి నృత్యాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న పేరిణి రంజిత్ శిష్య బృందం

వెంకటాపూర్, న్యూస్‌టుడే: రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. గురువారం ఉదయం యోగాసనాలతో ప్రారంభమైన శిబిరం సాయంత్రం నృత్య ప్రదర్శనతో ముగిసింది. ప్రొఫెసర్ పాండురంగారావు జియో ఇంజినీరింగ్, కాకతీయ ఆలయాల నిర్మాణశైలిపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ మధు ఒట్టెరే పురాతన కాకతీయ ఆలయాలకు వాడిన మెటీరియల్స్‌పై శిక్షణ తరగతుల్లో వివరించారు. సాయంత్రం రామప్ప ఆలయానికి చేరుకుని పేరిణి నృత్యశిల్పాలను వాలంటీర్లు పరిశీలించారు. అనంతరం పేరిణి రంజిత్ ఆధ్వర్యంలో శిష్యబృందం సంతోష్, గురుదేవ్, లోహిత్, చందు, శ్రీజ, తేజస్విని, సమీక్ష, రత్వికలు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు శ్రీధర్‌రావు, టూరిజం గైడ్లు, పురావస్తు శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేస్తున్న వాలంటీర్లు

ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలి

ములుగు రూరల్, న్యూస్‌టుడే: పురాతన శివాలయాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు మండలం జాకారంలోని శివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఆలయం పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ శాఖ అధికారులకు సూచించారు. ఆలయం హద్దులను గుర్తించి పూర్తి వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులకు చెప్పారు. గుడి అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలని పురావస్తు శాఖ అధికారులకు సూచించారు.


హనుమకొండ ఏసీపీకి అతి ఉత్కృష్ట సేవా పతకం



కె.దేవేందర్‌రెడ్డి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఇచ్చే ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 410 మందిని ఎంపిక చేసింది. హనుమకొండ ఏసీపీ కె. దేవేందర్‌రెడ్డికి అతి ఉత్కృష్ట పతకం లభించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఈయన 1996లో ఆర్ ఎస్సైగా ఉద్యోగంలో చేరారు. తర్వాత సివిల్ ఎస్సైగా కన్వర్షన్ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఠాణాల్లో ఎస్సై, సీఐగా విధులు నిర్వర్తించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సమర్థంగా విధులు నిర్వర్తించి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. పోలీస్‌శాఖలో పలు పతకాలు అందుకున్న దేవేందర్‌రెడ్డి తాజాగా అతి ఉత్కృష్ట అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా రవిచందర్



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బానోతు రవిచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు మండలం జీవంతరావుపల్లి గ్రామానికి చెందిన రవిచందర్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు అత్యంత సన్నిహితుడు. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2010లో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2011లో బండారుపల్లి గ్రామ ఉప సర్పంచిగా ఎన్నికయ్యారు. 2013లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, 2020లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులై ఇప్పటి వరకు కొనసాగుతున్నారు.

జలం జాస్తి.. ప్రయోజనం నాస్తి!

సాగునీరు, భూగర్భజలాల పెంపు లక్ష్యంగా నిర్మించిన చెక్‌డ్యాంల నిర్వహణ కనికట్టుగా మారింది. సహజ సిద్ధంగా ప్రవహించే నీటికి అడ్డుకట్ట వేసి సేద్యానికి మరల్చాలనే లక్ష్యం నీరుగారింది. జలం పుష్కలంగా చేరుతున్నా.. సేద్యం నిష్ఫలమైంది. రూ.లక్షల్లో నిధులు వ్యయం చేసినా.. మరమ్మతుల్లో చిన్నచూపుతో ప్రజాధనం వృథా వ్యయమైంది. నీటిపారుదలశాఖ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే సాగు సస్యశ్యామలం కానుంది. జిల్లాలోని చెక్‌డ్యాంల దుస్థితిపై 'న్యూస్‌టుడే' బృందం పరిశీలన చేపట్టగా కర్షకుల నుంచి నివేదన వ్యక్తమైంది.

– న్యూస్‌టుడే, వెంకటాపురం (ములుగు జిల్లా)

పిచ్చిమొక్కలు పెరిగి.. కాలువ కనుమరుగై



వెంకటాపురం మండలం సుడిబాక సమీపంలో 2003లో చెక్‌డ్యాం నిర్మించారు. ఐటీడీఏ ద్వారా రూ.10 లక్షలు వ్యయం చేసి కాంక్రీట్ కట్టడం పూర్తి చేశారు. ఈ నిర్మాణానికి కుడివైపున తూమును అమర్చి 200 మీటర్ల పొడవునా కాలువ తీశారు. దాదాపు 200 ఎకరాలకు చెందిన గిరిజన భూములకు సాగునీరందించే ప్రణాళికతో నిర్మించారు. నిర్వహణలేమితో చెక్‌డ్యాంలో నీరు నిల్వ చేరే ప్రాంతం పిచ్చిమొక్కలు, పూడికమట్టితో నిండింది. కాంక్రీట్ కట్ట సైతం తక్కువ ఎత్తులో ఉండటంతో నీరు నిలవకపోగా వాగు పాలవుతోంది. కాలువ సైతం ఎక్కడికక్కడ పూడుకుపోయి నీరు పారని పరిస్థితి నెలకొంది.

వరదలకు ధ్వంసం



మంగపేట, న్యూస్‌టుడే: మంగపేట మండలం పాతచీపురు దుబ్బ గ్రామ సమీపంలో కప్పవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కొట్టుకుపోయింది. కొన్నేళ్ల కిందట వచ్చిన వరదలకు ఆనవాళ్లు కోల్పోయింది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఈ డ్యాం ద్వారా 150 ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో నీటిపారుదలశాఖ నిర్మించింది. కనీసం పట్టింపు లేకపోవడంతో చెక్‌డ్యాం ఆనకట్ట తెగిపోయింది. దీంతో ఏటా వర్షాలకు నీరు అక్కడికి చేరుతున్నా నిల్వకాలేని పరిస్థితి ఉంది. దీనికి తోడు వృథాగా పారుతున్న జలం అంతా పంటపొలాలపై చేరడంతో ఇసుక మేటలు వేస్తోంది. ఈ ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలనే గోడు పట్టించుకునే దిక్కు లేదు.

ఎత్తు పెంచితేనే సాగు నీరు

- పూనెం మునేశ్వరరావు, రైతు



చెక్‌డ్యాంకు కాంక్రీట్ ఆనకట్ట ఎత్తు పెంచాలి. పూడిక మట్టిని తొలగించడంతో పాటు కాలువలను బాగు చేస్తే వానాకాలం, యాసంగి పంటలకు నీరందుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆయకట్టు రైతులందరం పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

మరమ్మతులు చేపట్టాలి

- కె. ధనలక్ష్మి, మహిళా రైతు, రాజుపేట



ధ్వంసమైన చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టింపు లేదు. ఆయకట్టు రైతులకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. వానాకాలంపైనే ఆధారపడి సాగు చేస్తున్నాం.

వివరాలు సేకరిస్తాం..

- రాంప్రసాద్, జగదీశ్, ఈఈ, నీటిపారుదలశాఖ

చెక్‌డ్యాంలకు సంబంధించి మరమ్మతులకు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఎక్కడైనా పాడైనట్లు మా దృష్టికి వస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను సేకరిస్తాం. ఆయకట్టు భూములకు సాగునీరందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.

ఇసుకతో పూడుకుపోయి..



ఏటూరునాగారం అటవీశాఖ రేంజి పరిధిలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాం పూడుకుపోయి ధ్వంసమైంది. వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు, అడవిలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించారు. ఆ తర్వాత మరమ్మతులు చేయడం, నిల్వ ఉన్న నీరు వన్యప్రాణులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవడాన్ని విస్మరించడంతో.. పూర్తిగా ఇసుకతో నిండిపోయింది. ఏ మాత్రం నీరు నిల్వ ఉండకుండా లోతట్టుకు చేరుతుంది. కనీసం పూడిక తొలగిస్తే కొంత మేర ఉపయోగం పడనుంది. – న్యూస్‌టుడే, ఏటూరునాగారం

సంక్షేమ పథకాలు వివరించాలి



మాట్లాడుతున్న భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు

ములుగు, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ లక్ష్యంగా భారత ప్రధాని మోదీ అందించే ప్రజా సంక్షేమ పథకాలను గ్రామాల్లో వివరించి సభ్యత్వ సేకరణ విస్తృతంగా చేపట్టాలని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. గురువారం ములుగులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదులో ములుగు జిల్లా ముందుండేందుకు ప్రతి నాయకుడు కృషి చేయాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే సభ్యత్వ సేకరణ తప్పనిసరి అని, అన్ని మండలాల నాయకులు నిర్దేశించిన లక్ష్యం సాధించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేసిన యాకూబ్ పాషా, గంగిశెట్టి రాజ్‌కుమార్, జినుకల కృష్ణాకర్‌రావులను శాలువాతో సన్మానించి అభినందించారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా సభ్యత్వ నమోదు ప్రభారి ఏవీఎల్ఎన్ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ మండల లక్ష్మణ్, క్రియాశీల సభ్యత్వ ప్రముఖ్ భూక్యా జవహర్‌లాల్, రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, నాయకులు రవీంద్రాచారి, నరేష్, రవీందర్‌రెడ్డి, కృష్ణాకర్‌రావు, సుధాకర్, ఓమ్రా తదితరులు పాల్గొన్నారు

కిలోల్లో కొంటున్నారు టన్నుల్లో తరలిస్తున్నారు!

జోరుగా రేషన్ బియ్యం దందా..

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, నర్సంపేట, కమలాపూర్, వరంగల్ క్రైం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దందా జోరుగా సాగుతోంది. పట్టణాలు, గ్రామాల్లోనే కాకుండా ఏజెన్సీ ప్రాంతాలకూ ఇది విస్తరించింది..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 11,11,401 కార్డుదారులకు ప్రతి నెలా 2,266 చౌకధరల దుకాణాల ద్వారా సుమారు 23 వేల టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో 2,250 టన్నులకుపైగా పక్కదారి పడుతోంది.

ఎలా చేస్తారంటే..

పేదల బియ్యంతో రూ.లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు, మిల్లర్లు.. పోలీసులకు చిక్కకుండా రకరకాల ఎత్తులు వేస్తున్నారు. రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుంచి సేకరించిన రాయితీ బియ్యాన్ని టన్నుల కొద్దీ నిల్వ చేస్తారు. అర్ధరాత్రి లారీల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తారు.



ఇది 30 టన్నుల రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ. ఇటీవల మహారాష్ట్ర వైపు వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.

1 రేషన్ దుకాణాల ద్వారా..

లబ్ధిదారులు తమ కార్డును కోల్పోకుండా ఉండేందుకు ప్రతి నెలా చౌకధరల దుకాణం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్నట్లు వేలిముద్రలు వేసి వస్తున్నారు. దుకాణాదారుడు వారికి కిలోకు రూ.10 చొప్పున లెక్క కట్టి డబ్బులు ఇస్తున్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కొందరు డీలర్లు లబ్ధిదారులకు డబ్బులకు బదులు సబ్బులు, సర్ఫు, గోధుమ పిండి, బోళ్ల సబ్బులు అందజేస్తున్నారు. అలా పోగైన బియ్యాన్ని మిల్లర్లకు రూ.14 నుంచి రూ.16 చొప్పున రాత్రి సమయంలో మిల్లులకు తరలిస్తున్నారు.

2 సన్నబియ్యంగా మార్చి

రేషన్ దుకాణాలతో పాటు ఇంటింటా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు తమ రైస్ మిల్లుల్లో సన్నబియ్యంగా మార్చుతున్నారు. అలా మరపట్టిన బియ్యాన్ని 25 కిలోల సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 మధ్య విక్రయిస్తున్నారు.

3 నూకలుగా..

పౌల్ట్రీఫారాలు, బీర్ల తయారీ కంపెనీల్లో నూకల వినియోగం పెరిగింది. దీంతో వాటికి డిమాండ్ అధికమైంది. దళారులు లబ్ధిదారుల నుంచి రూ.8 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లర్లకు రూ. 12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. నూకలుగా మరపట్టిన మిల్లర్లు కిలోకు రూ. 18 లేదా రూ.20 చొప్పున అవసరమున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ డివిజన్‌లో కొందరు అక్రమార్కులు సామర్థ్యం తక్కువ కలిగిన మిల్లులను స్థాపించుకుని బియ్యాన్ని నూకలుగా మరపడుతున్నారు.

మాఫియాలా బియ్యం డాన్‌లు

ఉమ్మడి జిల్లాలో చౌక బియ్యం మాఫియా విస్తరిస్తోంది. జిల్లాకు ఇద్దరు నుంచి నలుగురు చొప్పున దందా చేస్తూ బియ్యం డాన్‌లుగా ఎదిగారు. యువత, మైనర్లు పావులుగా మారుతున్నారు. దళారులకు ద్విచక్రవాహనం, సంచులు, డిజిటల్ కాంటాలు అప్పగించి ఊళ్లలోకి పంపిస్తున్నారు. వారు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొంటారు. డిజిటల్ కాంటాలపై తూకాలు చేస్తున్నారు. బస్తా బరువు 50 కిలోలు కాగానే వాహనంపై తమ రహస్య ప్రదేశానికి తరలిస్తారు. ఇందుకోసం అక్రమార్కులు పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు.



వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలో లబ్ధిదారుల నుంచి అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి బస్తా 50 కిలోలు కాగానే స్కూటీపై తీసుకెళ్తున్న యువకులు

● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో ఒక వ్యక్తి చక్రం తిప్పుతున్నారు. పోలీసు, రెవెన్యూ, పౌరసఫరాలశాఖ అధికారులను మచ్చిక చేసుకొని ఆ ప్రాంతంలో దందాను కొనసాగించే ఇతరులను పట్టిస్తున్నారు. తాను మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు 15 నుంచి 20 క్వింటాళ్ల చొప్పున ప్రయాణికుల ఆటోల్లో నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు.

● హనుమకొండ జిల్లాలో బడా దళారీ అక్రమానికి అడ్డూ అదుపు లేదు. మండలాల వారీగా మధ్యదళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారు.

సీఎంఆర్ లక్ష్యం కోసం..

వరంగల్ జిల్లా నల్లబెల్లి, దుగ్గొండి, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా గూడూరు, కేసముద్రం, మరిపెడ, హనుమకొండ జిల్లా కమలాపూర్ తదితర మండలాల్లోని మిల్లర్లే చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోలు సమయంలో వారికి కేటాయించిన ధాన్యాన్ని అధిక ధరలకు పక్కదారి పట్టిస్తున్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని భర్తీ చేసుకునేందుకు తక్కువ ధరకు లభించే పేదల బియ్యాన్ని టన్నుల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. వాటిని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద లెక్కలు చూపిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ఇదీ పరిస్థితి..



హనుమకొండ జిల్లా పరకాలలోని శ్రవణ్‌కుమార్ బిన్ని రైస్‌మిల్లరు రాయితీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ పౌరసరఫరాలశాఖకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు మిల్లుపై దాడి చేశారు. అందులో రూ.12.81 లక్షల విలువ చేసే 325 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని, 187.5 క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు.

హక్కుల సాధనకై కుమురంభీం బాటలో పయనిద్దాం



నివాళులర్పిస్తున్న పీవో చిత్రామిశ్రా, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన చట్టాల అమలు, హక్కుల సాధనకై కుమురం భీం బాటలో పయనిద్దామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా.మైపతి అరుణ్‌కుమార్, ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడె సాయిబాబు, రాష్ట్ర నాయకుడు పొడెం బాబు పిలుపునిచ్చారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలోని కుమురం భీం విగ్రహం వద్ద గురువారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొముురం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పీవో చిత్రామిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఐటీడీఏలను నిర్వీర్యం చేస్తున్నారని, సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ లేకుండా పోయిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిస్థితిని మార్చాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ నేతలు గణేష్, సురేష్, జనార్దన్, రవి, ఉపాధ్యాయులు సమ్మారావు, రమేష్, కోటయ్య, రఘుపతిరావు, సంతోష్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.


'ఏజెన్సీ చట్టాలపై కేంద్రానికి చిన్నచూపు'

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, సూడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఏటూరునాగారంలో గురువారం జిల్లా నాయకుడు ఎండీ.దావూద్ అధ్యక్షతన జరిగిన సీపీఎం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం అటవీ పరిరక్షణ చట్టం-2022 పేరుతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అదానికి అటవీ భూమిని కేటాయించిందన్నారు. తెలంగాణలోని రామగుండంలో రాడార్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించిందన్నారు. దిల్లీలో రాహుల్‌గాంధీ భాజపా వైఖరికి వ్యతిరేకంగా పోరాడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి దాటవేస్తున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, నాయకుల ౦ బీరెడ్డి సాంబశివారెడ్డి, రాజేందర్, చిట్టిబాబు, ఆదిరెడ్డి, రాజేష్, చిరంజీవి, రమేష్, వసంత సౌజన్య, పాల్గొన్నారు.

వానమ్మా.. వందనం!

ముగిసిన నైరుతి.. మురిసిన ఓరుగల్లు

– న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం



ఉమ్మడి వరంగల్ జిల్లాకు వానాకాలం కలిసి వచ్చింది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. అన్నదాతలు అప్పుడే యాసంగి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జూన్‌లో మొదలైన నైరుతి సీజన్ సెప్టెంబరుతో ముగిసినా అక్టోబరు రెండో వారం వరకు అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

మండలాలవారీగా అధిక వర్షపాతం శాతం

మండలం	శాతం
మహబూబాబాద్	
చిన్న గూడురు	117
మరిపెడ	100
నర్సింహులపేట	96
నెల్లికుదురు	60
దంతాలపల్లి	57
మహబూబాబాద్	44
కురవి	42
ములుగు	
ఏటూరునాగారం	101
మంగపేట	47
వెంకటాపురం	40
తాడ్వాయి	37
గోవిందరావుపేట	36
జనగామ	
కొడకండ్ల	50
జనగామ	24
భూపాలపల్లి	
మల్హార్‌రావు	30
కాటారం	28
రేగొండ	23
మహదేవ్‌పూర్	23
వరంగల్	
దుగ్గొండి	42
వర్ధన్నపేట	41
పర్వతగిరి	34
హనుమకొండ	
భీమదేవరపల్లి	34
ధర్మసాగర్	28
ఎల్కతుర్తి	24

సాగుబడికి చెరువుల నీరు

ఇది హసన్‌పర్తి మండలం నాగారం చెరువు. ఉమ్మడి జిల్లాలో 3,900 చెరువులు, కుంటలున్నాయి. ఈసారి 65 శాతం పూర్తి స్థాయిలో నిండాయి. మిగతావాటిలో 50 నుంచి 75 శాతం వరకు నీరు చేరింది. వీటికింద 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



జిల్లాల వారీగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షపాతం (మి.మీ.)

జిల్లా	సాధారణం	నమోదైంది
ములుగు	1200	1603.8
మహబూబాబాద్	878.0	1280.5
జయశంకర్	985.8	1159.8
వరంగల్	901.0	1082.5
హనుమకొండ	875.7	981.5
జనగామ	755.2	829.2



పంటలకు నీరు అందిస్తున్న రైతు

పంటలకు మేలు

- తోకల ఆదిరెడ్డి, రైతు, సీతంపేట, హసన్‌పర్తి



ఈసారి సకాలంలో వర్షాలు పడ్డాయి. యాసంగిలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. చెరువులతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వరి పంటకు నీరందించే అవకాశం ఉన్నందున యాసంగి సాగుపై ఆశలు పెంచుకున్నాం.

సాగు విస్తీర్ణం పెరుగుతుంది

- రవీంద్రసింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఆశించిన మేరకు వర్షాలు కురిశాయి. దీంతో జలాశయాల్లోకి వరదనీరు చేరింది. నీరు లేని చెరువుల్లోకి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నింపుతారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుంది.




ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో నిండుగా వ్యవసాయ బావి

రైతులకు మద్దతుగా పత్తి కొనుగోళ్లు!

మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్

ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధంగా ఉంది.. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం అని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ తెలిపారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, మద్దతు ధరపై అవగాహన, ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం 'ఈనాడు' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు జేడీఎం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

–ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ఈనాడు ఫోన్ ఇన్

❓ పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకొస్తే.. సీసీఐ కొనుగోలుచేస్తుందా?
- యాకూబ్, కొత్తూరు, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లా

✔ రైతులు పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకురావొద్దు. విడి పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ప్లాస్టిక్, గన్నీ సంచుల్లో తీసుకురావడం వల్ల ఆ బస్తాల్లోని పోగులు పత్తిలో కలిసిపోయి నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. స్పిన్నింగ్ చేసే సమయంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయి.

❓ ఈ ఏడాది అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. కొంతమేర మచ్చ వచ్చి రంగు మారింది. పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం ఎక్కువగా ఉంది. ఇలాంటి పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందా? **- (శ్రీనివాస్, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా), (శివశంకర్, ఆత్మకూరు, హనుమకొండ జిల్లా), (సతీశ్, వెన్నారం, డోర్నకల్), (అన్నా తిరుపతి, ములుగు జిల్లా), (వెంకటేశ్వర్, డోర్నకల్), (తోట రాజేందర్, అబ్బాపూర్, ములుగుజిల్లా)**

✔ నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉంటేనే కనీస మద్దతు ధర రూ.7,521కు సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమశాతం సడలింపు, నాణ్యత లేకున్నా కొనుగోలు చేసే అవకాశం లేదు. రైతులు మొత్తం వచ్చిన దిగుబడిలో మంచి పత్తిని, నాణ్యత లేనిది వేరు చేయాలి. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందొచ్చు. మిగిలినది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవచ్చు. ఉదయం కాకుండా మధ్యాహ్నం పత్తిని ఏరడం ద్వారా తేమశాతాన్ని తగ్గించొచ్చు.



❓ ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి దాన్ని సీసీఐకి విక్రయిస్తూ.. లబ్ధి పొందుతున్నారు. ఈసారి మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులను నియంత్రిస్తారా? **- (మహేశ్ హాజంపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా), (శ్రీనివాస్, ఖిలాషాపూర్, జనగాం జిల్లా)**

✔ ఈ ఏడాది నోటిపై చేసిన మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహిస్తే. . సంబంధిత మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటాం. సీసీఐ కాకుండా ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గుర్తిస్తే.. మిల్లుల్లో సమస్యలపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నెంబర్ల ద్వారా సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

❓ ప్రైవేటు వేబ్రిడ్జిలకు, మిల్లుల్లోని వేబ్రిడ్జిలకు ఒక్కోసారి తూకాల్లో తేడాలు వస్తున్నాయి. దాంతో రైతులు నష్టపోతున్నారు. తూకాల్లో మోసాలను ఎలా అరికడతారు?
- బుస్సారి లక్ష్మణ్, కంచరపల్లి, రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా

✔ మిల్లుల్లో పంట ఉత్పత్తుల తూకాల్లో ఉద్దేశపూర్వకంగా మోసాలకు పాల్పడితే సంబంధించిన వారిపై చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు అధికారులతో వేబ్రిడ్జిల తనిఖీలు నిర్వహిస్తాం. తూకాల్లో తేడాలొచ్చినట్లు అనుమానం వస్తే.. రైతులు.. తూనికలు, కొలతలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

తూనికలు, కొలతలు అధికారుల నెంబర్లు

జనగామ - 9440575081

హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లా - 9963311956

వరంగల్ - 9885558028

మహబూబాబాద్ - 9177661663

❓ దళారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తూ.. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
- బి.సాంబయ్య, నల్లబెల్లి, వరంగల్ జిల్లా

✔ ఆరుగాలం పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దు. దగ్గరలోని మార్కెట్ కమిటీల్లో.. సీసీఐ నోటిపై చేసిన మిల్లుల్లో పత్తిని అమ్మడం ద్వారా మార్కెటింగ్‌శాఖ రైతుల సరకుకు జవాబుదారీగా ఉంటుంది. గిట్టుబాటు ధరతో పాటు నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లిస్తుంది. తరుగు పేరుతో దళారులు చేసే మోసాలకు మార్కెటింగ్‌శాఖ బాధ్యత వహించదు.

❓ పత్తి రైతుల కోసం మార్కెటింగ్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సప్ నెంబరులో రైతు వ్యక్తిగత చరవాణి నెంబరు నమోదుచేసినా పండించిన పంట వివరాలు రావడం లేదు?
- రమేశ్, దేవరప్పుల, జనగామ జిల్లా

✔ ఎన్ఐసీ ఇచ్చిన డేటా ఆధారంగా మార్కెటింగ్‌శాఖ పంట నమోదుచేసిన 21,65,326 మంది రైతులతో వాట్సాప్ నెంబరు (88972 81111)ను రూపొందించింది. ఈ నెంబరు సహాయంతో రైతులు సాగుచేసిన పత్తి వివరాలు, ఎన్ని క్వింటాళ్ల వరకు సీసీఐకు విక్రయించేందుకు అవకాశముంది.. తదితర వివరాలను ముందస్తుగా తెలుసుకోవచ్చు. ఇందులో రైతు వివరాలు రానంత మాత్రాన సీసీఐకు పంట విక్రయించవద్దనే నిబంధన లేదు.

❓ వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పండించిన పంట విస్తీర్ణం కన్నా.. తక్కువ నమోదు చేస్తే. ఏంచేయాలి? **- రవీందర్, తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా**

✔ వ్యవసాయ అధికారులు నమోదు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగానే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం.. ఆధార్ నెంబరు ప్రామాణికీకరణ, రైతు వేలిముద్రలు, ఓటీపీ ద్వారా ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసే అవకాశముంది. ఒకవేళ వ్యవసాయ విస్తరణాధికారులు సాగు విస్తీర్ణాన్ని తక్కువగా నమోదు చేస్తే.. ఆ రైతులు సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించిన పత్రాన్ని సీసీఐ అధికారులకు సమర్పించాలి.

19 నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి, న్యూస్‌టుడే: హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. గురువారం కళాశాలలో వివరాలు వెల్లడించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 800 మంది హాజరవుతారన్నారు. బ్యాడ్మింటన్‌లో 12, హ్యాండ్‌బాల్‌లో 14, కబడ్డీ 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీములు పాల్గొంటాయన్నారు. ప్రారంభం రోజు నుంచి పోటీలు ముగిసే వరకు మైదానంలో వాకర్స్‌కు అనుమతి లేదన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్, పీడీ భాస్కర్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

ఇసుక దందాపై స్పందించిన కేటీఆర్



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారంపై ఈ నెల 14 'ఇసుక దందా.. వారికి మామూలే' శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనానికి మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని జత పరుస్తూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం అంటూ పోస్టు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఇసుక మాఫియాకు అభయ హస్తం అంటూ వాగ్బాణాలు సంధించారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆర్టీసీ బస్సులు రైట్.. రైట్..



హనుమకొండలోని నయీంనగర్ కొత్త వంతెన మీదుగా ఆర్టీసీ బస్సులు పరుగులు ప్రారంభించాయి. వంతెన నిర్మాణం పనులు పూర్తై, ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నా.. ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని, ఇతర రూట్లలో తిరగడంతో సమయం వృథా కావడంతో పాటు ప్రయాణికులకు టికెట్‌పై అదనపు భారం తప్పడం లేదంటూ 'ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర వార్తకు ఆర్టీసీ, పోలీసు అధికారులు స్పందించారు. వంతెన మీదుగా బస్సులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్సులను ఈ మార్గంలో పంపించారు. దీంతో కరీంనగర్, హుజూరాబాద్, నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం ముందుగా బయలు బస్సులకు అదనపు ఛార్జి రూ.10 వసూలు చేశారని, తరవాత బస్సులకు అదనపు ఛార్జి తొలగించామని చెప్పారు. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా విద్యార్థులు, యువతి, యువకులకు జిల్లా, రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా ఈ మధ్య తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివితో తీసిన షార్ట్‌ఫిలిం పెన్‌డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22లోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పీఆర్వోకు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు పెంచే అంశాలకు సంబంధించి గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు తీసిన ఫొటోలు, షాట్‌ఫిలిం వీడియోలను మాత్రమే పంపించాలన్నారు. పూర్తి వివరాలకు పీఆర్వో సెల్ 87126-85050 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వనదేవతల కటాక్షం..

మహా జాతర శాశ్వత పనులకు శ్రీకారం!

మేడారం మహాజాతర పనులు ఎప్పుడూ సమయానికి పూర్తి కావు.. జాతరకు ఐదారు నెలల ముందు సమావేశాలు నిర్వహించడం, రెండు నెలల ముందే నిధులు మంజూరు చేయడం, హడావుడిగా పనులు చేపట్టడం జరుగుతుండేది. ఈ ఆనవాయితీకి స్వస్తి పలికేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. జాతరతో సంబంధం లేకుండా మేడారంలో చేపట్టాల్సిన శాశ్వత పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. –తాడ్వాయి, న్యూస్‌టుడే(ములుగు జిల్లా)



మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి

మేడారం మహాజాతర 2026 ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉంది.. అంటే మరో ఏడాదిన్నర ఉంది.. గత అనుభవాల దృష్ట్యా మహా జాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క ఇప్పుడే ప్రత్యేక దృష్టిసారించారు. గత మే నెలలోనే జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించి మేడారం అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏయే పనులు ఎప్పుడు చేయాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 4న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కార్యాచరణ ప్రారంభించిన కలెక్టర్

కలెక్టర్ టీఎస్.దివాకర ఇప్పటికే రెండుసార్లు జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన పనులను గుర్తించడం, గత జాతరలో ఎదుర్కొన్న ఇబ్బందులపై పూర్తిస్థాయిలో వివిధ శాఖలను అడిగి తెలుసుకొన్నారు. గత జులై 11న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రూ.17.25 కోట్లు మంజూరు

గతంలో జాతర నిర్వహణకు కొద్దిరోజుల ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండేది. దీంతో అవి పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యేవి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈసారి అధికారులు ముందుగానే మేల్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పంపించిన రూ.17.25 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ప్రతిపాదనలు.. మంజూరైన నిధులు (రూ.కోట్లలో)

- సీఆర్ఆర్ పథకం ద్వారా కాల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 8
- మేడారంలోని శివరాంసాగర్ చెరువు నుంచి రిజర్వ్ ఫారెస్టు వరకు రోడ్డు విస్తరణ: 2.75
- ఎమ్మార్ పథకంలో నార్లాపురం చెక్‌పోస్టు నుంచి కాల్వపల్లి వరకు తారు దారి: 2.50
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 2
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు దారి: 2

వీటిలో కొన్ని టెండరు పూర్తయ్యాయి.. త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్‌రావు తెలిపారు.

అతిథిగృహాల నిర్మాణానికి..



80 శాతం పూర్తయిన పూజారుల అతిథిగృహం

శాశ్వత ఏర్పాట్లే లక్ష్యంగా దేవాదాయశాఖ రూ.3.50 కోట్లతో అతిథిగృహాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పూజారుల అతిథి గృహం 80 శాతం పూర్తయింది. భక్తులు, అతిథుల కోసం అతిథి గృహం నిర్మించేందుకు ప్రభుత్వం మరో రూ.2 కోట్లు మంజూరు చేసింది. రెండు రోజుల కిందట అధికారులు స్థల పరిశీలన చేశారు. దేవాదాయ శాఖ నిర్మాణాలు మరో ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు.

19న జాతర పనులకు శంకుస్థాపన

రూ.7.35 కోట్లతో రెండు ప్యాకేజీలుగా చేపట్టే నార్లాపురం చెక్‌పోస్టు-కాల్వపల్లి, ఊరట్టం అమరవీరుల స్తూపం-ఊరట్టం, కన్నెపల్లి ఆర్చిగేటు-సారలమ్మ గుడి, మేడారం ఆర్అండ్‌బీ రోడ్డు-శివరాంసాగర్ చెరువు వరకు రహదారుల నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయింది. మంత్రి సీతక్క ఈ పనులకు 19న శంకుస్థాపన చేయనున్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



వెంకటాపురం: మహాలక్ష్మి ఆలయం వీధి శిబిరంలో



వాజేడు మండలం మొరుమూరు పంచాయతీ పరిధిలో..

వాజేడు, న్యూస్‌టుడే: వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు పేర్కొన్నారు. జిల్లా పరిధిలో పలు చోట్ల గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మాతాశిశు సంరక్షణ వైద్య బృందం ఆధ్వర్యంలో వాజేడు మండలంలోని మొరుమూరు పంచాయతీ పరిధి అరుణాచలపురం, గణపురం గ్రామాలలో వైద్యశిబిరం నిర్వహించారు. మాతాశిశు సంరక్షణ వైద్య బృందం వైద్యాధికారి యోషిత మధుమేహం, రక్తపోటు పీడితులను పరీక్షించారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి వైద్య సలహాలు అందించారు. శిబిరంలో 46 మందిని పరీక్షించి మందులను అందజేశారు. శిబిరంలో వైద్యపర్యవేక్షకుడు కోటిరెడ్డి, వైద్య సిబ్బంది సత్య నాగవేణి, అనూష, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం: మండలంలోని ఎదిర పీహెచ్‌సీ పరిధికి చెందిన పల్లె దవాఖానా వైద్యులు వెంకటాపురం, రాచపల్లి, నూగూరు, తిప్పాపురం, ఆలుబాక, ఎదిర గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి సేవలందించారు. అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, పూర్వపు రోగుల ఆరోగ్యస్థితి గతులను ఆరా తీశారు. వెంకటాపురం పట్టణంలోని పలు కాలనీల్లో వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రత్యేకమైన ఐడీ గుర్తింపు సంఖ్యను నమోదు చేశారు. ఈ శిబిరాల్లో వైద్యులు పవన్ కళ్యాణ్, సోహల్, ఆశీశ్, వినయ్, స్నేహ, ఎంఎల్‌హెచ్‌పీ మనోహర్, జ్యోతి, డీపీఎంవో సత్యనారాయణ, ఎన్‌సీడీ సిబ్బంది తిరుపతి, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు భరోసా



కంటెయినర్ ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వెంకటాపురం, వాజేడు, న్యూస్‌టుడే: ప్రసవం అనంతరం తలెత్తిన అనారోగ్య సమస్యకు మెరుగైన వైద్యం అందించే బాధ్యతను తాము తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి అప్పయ్య భరోసా ఇచ్చారు. వెంకటాపురం మండలంలోని చినగంగారంలో గురువారం ఆయన పర్యటించారు. ఇటీవల స్థానిక సీహెచ్‌సీలో ప్రసవం అనంతరం అనారోగ్యానికి గురైన ఆ గ్రామానికి చెందిన చింత భువనేశ్వరి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నడుం నొప్పి తీవ్రంగా వేధిస్తున్నట్లు బాధితురాలు డీఎంహెచ్‌వోకు విన్నవించగా ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వరంగల్‌లోని ఎంజీఎం, సీకేఎం ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సిబ్బందితో చర్చించి సమస్య నిర్ధారణ పరీక్షలు చేయిస్తామన్నారు. పోషకాహారం విధిగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. మరికాల ఆరోగ్య ఉప కేంద్రం, వాజేడు మండలంలోని ఏడ్జర్లపల్లిలోని కంటైనర్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. హాజరు పట్టిక, మందుల నిల్వలను చూశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భవ్యశ్రీ, సిబ్బంది యాకలక్ష్మీ, రాఘవులు, ఏఎన్‌ఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

తాడ్వాయి, న్యూస్‌టుడే: తాడ్వాయి మండలంలో కొండపర్తి రహదారిపై కంకరపోసి వదిలేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలి - **కల్లి రమేష్, కొండపర్తి**

సమస్య మా దృష్టిలో ఉంది. ఈ రహదారి నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరం చెబుతోంది. త్వరలోనే అటవీశాఖ అనుమతులు వచ్చే అవకాశం ఉంది. - **రాము, ఏఈఈ, గిరిజన సంక్షేమశాఖ**

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ములుగు, న్యూస్‌టుడే: విద్యుత్తు మరమ్మతులలో భాగంగా ములుగు పట్టణంలో ఈనెల 18న కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ములుగులోని పత్తిపల్లి రోడ్డు, వివేక్ కాలనీ, శ్రీనివాసకాలనీ, ప్రగతినగర్ ఏరియాలో సరఫరా నిలిపివేయనున్నామన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



నూతన ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండలంలో నియామకమైన కొత్త ఉపాధ్యాయులకు రాష్ట్రోపాధ్యాయ సంఘం ఉపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలాధ్యక్షుడు వీరభద్రం ఆధ్వర్యంలో రాష్ట్రోపాధ్యాయ సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరుతూ పలువురికి సభ్యత్వం కల్పించారు. విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం పోరాతుందని, జిల్లా, మండల సంఘాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రధాన కార్యదర్శి వాంకుడోతు రాంబాబు, జిల్లా నాయకుడు పోతు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుమురంభీం ఆశయాలను సాధిస్తాం..!



మంగపేటలో ఆదివాసీ సంఘాల ఐకాస నాయకులు



వెంకటాపురం మండల కేంద్రంలో..



మేడారంలోని గిరిజన మ్యూజియంలో

ములుగు, న్యూస్‌టుడే: కుమురం భీం ఆశయాలను సాధిస్తామని నాయకులు పేర్కొన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. జల్, జంగిల్, జమీన్ కోసం నిజాం పాలకులపై దండెత్తిన గొప్ప వీరుడని కొనియాడారు. ములుగులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, విద్యుత్తు డీఈ పులుసం నాగేశ్వర్‌రావు, ప్రజా సంఘాల ఐకాస చైర్మన్ ముంజాల భిక్షపతి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్వరం రవికాంత్, నాయకులు కుమారస్వామి, వెంకటేశ్వర్లు, నారాయణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం: ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పూనెం రామచంద్రరావు, పూనెం సాయి, పర్శిక సతీష్, చింత సోమరాజు, ఆదివాసీ మహిళలు ఇర్పా నారాయణమ్మ, గొంది రమాదేవి, ఇరప లక్ష్మీ, సోలం స్వరూప, లక్ష్మణ్, నర్సింహారావు, రాంబాబు, సుదర్శన్, వెంకటకృష్ణ, శంకర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: ఆదివాసీ ప్రజా సంఘాల ఐకాస చైర్మన్ మద్దెల అంజయ్య ఆధ్వర్యంలో మంగపేటలో నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఎగరవేశారు. ఆదివాసీ ప్రజా సంఘాల ఐకాస, ఉద్యోగ సంఘాల నాయకులు కొండ చెంచయ్య, జబ్బరవి, చాదమల్లయ్య, డబ్బుల ముత్యాలరావు, చాద శేఖర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు

● మండలంలోని అకినేపల్లి మల్లారంలో నివాళులర్పించారు. నాయకులు ముత్యాల రావు, నర్సింహామూర్తి, రాధ, శైలజ, వెంకన్న ప్రవీణ్, సీతయ్య, వెంకటేశ్వర్లు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని మేడారం గిరిజన మ్యూజియంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మ్యూజియం సహాయ క్యూరేటర్ కుర్సం రవికుమార్, ఆదివాసీ నాయకులు ఆలం సుధీర్, అనిల్, స్వాతి, సమ్మక్క, మ్యూజియం సిబ్బంది పాల్గొన్నారు.



అకినేపల్లి మల్లారం గ్రామంలో..



ములుగులోని విశ్రాంత భవనంలో..

ఏకలవ్య విద్యాలయాన్ని మంజూరు చేయాలి

వెంకటాపురం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండలానికి ఏకలవ్య విద్యాలయాన్ని మంజూరు చేయాలని భాజపా లీగల్ సెల్ నాయకులు, న్యాయవాది పిట్ట శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతమైన వెంకటాపురం, వాజేడు మండలాల్లో విద్యా, సామాజిక రంగాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గిరిజన, గిరిజనేతర విద్యార్థుల ఉన్నతికి ఏకలవ్య పాఠశాలను మంజూరు చేసి రూ.40 కోట్ల నిధులు కేటాయించాలన్నారు. వాజేడు మండలంలోని మొడికుంటవాగు మధ్యతరహా జలాశయాన్ని పూర్తి చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. సరిహద్దులోని చర్ల మండలంలో బొగ్గు నిక్షేపాలు వెలికి తీసే ప్రక్రియను చేపడితే ఈ ప్రాంతంలోని యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీపై వెళ్తున్న గురువుకు సన్మానం

వాజేడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి పాఠశాలలో ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు సన్మానం చేశారు. పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న వాసం సుదర్శన్‌రావును అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. పాఠశాలకు నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మొరుమూరు పంచాయతీ మాజీ సర్పంచి నరేశ్‌కుమార్, రవి, ప్రసాద్, రాంబాబు, సూర్యనారాయణ, శాంతమూర్తి, లక్ష్మణ్, నాగార్జున, నర్సయ్య, హిమాం పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి చేయూత



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన జనగాం రాజేష్ మంచిర్యాల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న ఆ విద్యార్థికి ఆకులవారిఘణపురానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, ఖమ్మానికి చెందిన సుగ్గాల మురళి, సుగ్గాల నిఖిల తదితర దాతలు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, కన్నె రాజు, బొట్టు కమలాకర్, కోలా రాజేష్, సుహాస్ని, పృథ్వీ రాజ్‌కుమార్, రాంప్రసాద్, సృజన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'క్రష్ సెంటర్ల ఏర్పాటు సరికాదు'



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించి అంగన్‌వాడీ కేంద్రాలలో కొత్తగా క్రష్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకునే ఆలోచనను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. గురువారం ములుగులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు ఉపాధ్యాయులకిచ్చే వేతనాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. క్రష్ స్వచ్ఛంద సంస్థ ద్వారా బాలల సంరక్షణ పేరుతో సెంటర్లను ప్రైవేటీకరణ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మూడేళ్లకుపైనున్న పిల్లల్ని పాఠశాలకు పంపిస్తారని, మూడేళ్లలోపున్న వారిని క్రష్ సెంటర్లకు పంపిస్తే ఇక అంగన్‌వాడీలు ఎవరికి సేవ చేయాలని ప్రశ్నించారు. క్రష్ సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండు చేశారు. సమ్మక్క, ప్రేమకుమారి, జమునారాణి, రమాదేవి, ధనలక్ష్మి, సూరమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు



ఎంపికైన క్రికెటర్లతో సంఘం ప్రతినిధులు

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన ఎంపిక పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన అండర్-23 క్రికెటర్లు హాజరయ్యారు. జిల్లాల వారీగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో నైపుణ్యాలు పరీక్షించి ఒక్కో జిల్లా నుంచి 18 మంది ఆటగాళ్లను ఎంపిక చేసినట్లు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆరు జిల్లాల నుంచి 108 మందిని ఎంపిక చేశామన్నారు. ఇందులో నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక కోసం ఈ నెల 20 నుంచి 23 వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. వరంగల్ క్రికెట్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పోడు భూముల విషయంలో ఘర్షణ

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామ సెంటర్‌లో గురువారం రాత్రి పోడు భూముల విషయంలో తీవ్ర ఘర్షణ జరిగినట్లు తెలిసింది. పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి పలుకుబడి లేదని తెలిసి కొందరు వ్యక్తులు ఆ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన అసలు సాగుదారులు భూమిపైకి వచ్చిన వారితో ఘర్షణకు దిగారు. స్థానిక పెద్దలు, పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి గొడవ సద్దుమణిగేలా చేసినట్లు సమాచారం. ఈ విషయంపై సీఐ శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతోందని తెలిసి అక్కడికి వెళ్లామన్నారు. ఇరువర్గాలతో మాట్లాడి ఘర్షణ జరగకుండా చూశామన్నారు. వారిని త్వరలో ఠాణాకు పిలిపించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీ నల్ల మల్లారెడ్డి తండ్రి లేట్ నల్ల సాయిరెడ్డి ఇంటినెం. 4-52, దివ్యానగర్, కాచివాని సింగారం, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్ జిల్లా గారు కాచివాని సింగారం గ్రామ శివారు సర్వేనెం. 60 దివ్యానగర్ ఫేజ్ -2 లేఅవుట్‌లో గల ప్లాట్ నెం. 204 విస్తీర్ణం 200 గజాలు చట్టబద్ధంగా రిజిస్టర్డ్ అయినది. దాని యొక్క లింక్ డాక్యుమెంట్ నెం. 4945/1990 ను పొందివున్నారు. అట్టి లింక్ డాక్యుమెంట్ ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిష్టరు చేయబడినది.
తేది 16-10-2024 బుధవారం రోజున నా క్లయింట్ శ్రీ నల్ల మల్లారెడ్డి వ్యక్తిగత పని మీద ములుగులో స్నేహితుడి ఇంటికి వెళ్ళుచుండగా ములుగు శివారులో గల గట్టమ్మ గుడివద్ద ఆగినప్పుడు పైన తెలిపిన ఆస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ తో పాటు ఇతర డాక్యుమెంట్స్ ఉన్న కవర్ పోయినది. అట్టి లింక్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన నా క్లయింట్ అడ్రస్‌కు గాని ఈ క్రింద చూపిన నా అడ్రస్‌కి గాని అప్పగించి తగిన పారితోషకం పొందగలరని మనవి.

ఇట్లు
జంబుల నరసింహారెడ్డి, న్యాయవాది.
ప్లాట్ నెం.5ఎ. ఎ.పి. హెచ్.బి. బిల్డింగ్,
ఆపోజిట్: స్మార్ట్ హెూమ్, బర్కత్‌పుర,
హైద్రాబాద్-27. మొబైల్ 9848264119

సమస్యలపై మధ్యవర్తులను ఆశ్రయించొద్దు



ప్రసంగిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

ములుగు రూరల్, న్యూస్‌టుడే: సమస్యలపై ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. మధ్యవర్తులను ఆశ్రయించొద్దన్నారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ములుగు మండలంలోని మదనపల్లి, జగ్గన్నపేట గ్రామాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలకు ఎదురయ్యే సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో నేరాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయని, ప్రతి ఒక్కరూ ఫోన్ వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ ఎవ్వరికి చెప్పొద్దని సూచించారు. ఇతరుల నుంచి వచ్చే లింకులు తెరవకూడదన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైసు మిల్లర్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

● జిల్లా అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్



ములుగు, న్యూస్‌టుడే: జిల్లా రైసు మిల్లర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ములుగులోని జిల్లా అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. హోరాహోరీగా సాగిన పోరులో జిల్లా అధ్యక్షుడిగా ములుగు మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన బాదం ప్రవీణ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష పదవికి మాత్రమే పోలింగ్ నిర్వహించి మిగతా కార్యవర్గాన్ని అధ్యక్షుడిగా ఎన్నికైన వారు నామినేట్ చేయాలనే నిబంధనలతో ఈ ఎన్నిక జరిగింది. అసోసియేషన్‌లో మొత్తం 47 మంది సభ్యులుండగా 46 మంది పాల్గొన్నారు. అధ్యక్ష స్థానానికి ప్రవీణ్‌తో పాటు కాట్రగడ్డ సతీష్‌కుమార్ పోటీ పడ్డారు. ప్రవీణ్‌కు 25 ఓట్లు రాగా, ప్రత్యర్థి సతీష్‌కుమార్‌కు 21 ఓట్లు వచ్చాయి. అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రవీణ్ వెంటనే 13 మందితో మిగిలిన జిల్లా కార్యవర్గాన్ని నామినేట్ పద్ధతిన ఎంపిక చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పల్లెపాటి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గురిజాల సహోదర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి ఎలగందుల మోహన్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమురవెల్లి హరినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు కాపిడి సుదర్శన్ రెడ్డి, అక్కల రఘోత్తం, జిల్లా సంయుక్త కార్యదర్శులు డ్యాగల భద్రయ్య, వీఎన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, వేలేందర్, శాశ్వత ఆహ్వానితులుగా అనిల్‌కుమార్, శ్రవణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు అసోసియేషన్ సభ్యులకు అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీ నల్ల మల్లారెడ్డి తండ్రి లేట్ నల్ల సాయిరెడ్డి ఇంటినెం. 4-52, దివ్యానగర్, కాచివాని సింగారం, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్ జిల్లా గారు కాచివాని సింగారం గ్రామ శివారు సర్వేనెం. 60 దివ్యానగర్ ఫేజ్ -2 లేఅవుట్‌లో గల ప్లాట్ నెం. 165 విస్తీర్ణం 181 గజాలు చట్టబద్ధంగా రిజిస్టర్డ్ అయినది. దాని యొక్క లింక్ డాక్యుమెంట్ నెం. 4958/1990 ను పొందివున్నారు. అట్టి లింక్ డాక్యుమెంట్ ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిష్టరు చేయబడినది.
తేది 16-10-2024 బుధవారం రోజున నా క్లయింట్ శ్రీ నల్ల మల్లారెడ్డి వ్యక్తిగత పని మీద ములుగులో స్నేహితుడి ఇంటికి వెళ్ళుచుండగా ములుగు శివారులో గల గట్టమ్మ గుడివద్ద ఆగినప్పుడు పైన తెలిపిన ఆస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ తో పాటు ఇతర డాక్యుమెంట్స్ ఉన్న కవర్ పోయినది. అట్టి లింక్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన నా క్లయింట్ అడ్రస్‌కు గాని ఈ క్రింద చూపిన నా అడ్రస్‌కి గాని అప్పగించి తగిన పారితోషకం పొందగలరని మనవి.

ఇట్లు
జంబుల నరసింహారెడ్డి, న్యాయవాది.
ప్లాట్ నెం.5ఎ. ఎ.పి. హెచ్.బి. బిల్డింగ్,
ఆపోజిట్: స్మార్ట్ హెూమ్, బర్కత్‌పుర,
హైద్రాబాద్-27. మొబైల్ 9848264119

సమస్యలపై రెవెన్యూ మంత్రికి వినతి

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి కాంగ్రెస్ శ్రేణులు తీసుకెళ్లారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుతో కలిసి గురువారం హైదరాబాద్‌లో మంత్రిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, శ్రేణులు కలిశారు. పాలెంవాగు ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోవడంతో రైతులకు సాగునీరు అందని విషయాన్ని విన్నవించారు. వెంకటాపురం-భద్రాచలం ప్రధాన మార్గం అసంపూర్తి పనులను విన్నవించగా పాలనాధికారితో చర్చించి పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. త్వరలోనే ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యలతో పాటు అభివృద్ధి పనులను వేగిరం చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు శ్రీరాముల రమేశ్, జల్లిగంపల కళాధర్, ఎడ్ల క్రాంతి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం బండారుపల్లిలోని మోడల్ పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ పీజీటీ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ దేవిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఈనెల 19న మధ్యాహ్నం పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

19న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలను ఈనెల 19న ములుగులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈవో పాణిని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన ఆరు అంశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని ఎంఈవోలు ఒక్కో గైడ్ టీచర్ సహకారంతో జిల్లాస్థాయికి పంపించాలన్నారు. జిల్లా స్థాయిలో విజేతలైన విద్యార్థులను నవంబరులో జరిగే రాష్ట్ర స్థాయికి పంపించనున్నట్లు పేర్కొన్నారు.

బాలలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి

ములుగు, న్యూస్‌టుడే: బాలలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని ములుగు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కొమురయ్య అన్నారు. గురువారం ములుగు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలలకు బంగారు భవిష్యత్తు అందించడం మన బాధ్యత అన్నారు. గ్రామస్థాయిలో బాలల హక్కుల కమిటీలను పర్యవేక్షించేందుకే మండల కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పఠన నైపుణ్యంతో విజ్ఞానం



వెంకటాపురం మండల కేంద్రంలోని జడ్పీఎస్ పాఠశాలలో..

వెంకటాపురం, న్యూస్‌టుడే: నిరంతరం పఠన నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే విజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ, బాలరక్ష భారత్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు శ్రీకాంత్ అన్నారు. ప్యూర్ ప్లే, బాలరక్ష భారత్ సౌజన్యంతో వెంకటాపురం మండల కేంద్రంలోని జడ్పీఎస్ ఉన్నత పాఠశాలకు గురువారం గ్రంథాలయం పుస్తకాలు, డస్టు బిన్‌ను వితరణ చేశారు. దాదాపు వంద పుస్తకాలు, ఇతర సామగ్రిని ఎంఈవో, పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. భావిపౌరుల ఉన్నతికి తాము స్వచ్ఛందంగా సేవ చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, రాందేవ్, వెంకటేశ్, నాగమణి, రామకోటి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



వాజేడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

వాజేడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్యూర్ ప్లే సంస్థ ఆర్థిక సాయంతో భారత్ బాలరక్ష స్వచ్ఛంద సంస్థ గ్రంథాలయ పుస్తకాలను సరఫరా చేశారు. పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధి, విజ్ఞాన అభివృద్ధికి ఉపయోగపడే శాస్త్రవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధులు, దేశభక్తుల జీవిత చరిత్ర, శాస్త్ర, సాంకేతిక రంగాలు, పర్యావరణం, ఆరోగ్యం, జానపద, ఆంగ్ల కథలు తదితర పుస్తకాలను సరఫరా చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, చల్లగురుగుల మల్లయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి, సిబ్బంది, పలు సంఘాల నాయకులు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతి వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖాధికారి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రామాయణం లాంటి మహాగ్రంథాన్ని అందించిన గొప్ప మహర్షి వాల్మీకి అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ కనుకయ్య, బోయ సంఘ సభ్యురాలు రేణుక, బోయ కులస్థులు, బీసీ వెల్ఫేర్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.